# తా...తీ

## సి. ఆనందారామం

'తా...తీ'

ఇది నీకు న్యాయం కాదు.

నువ్వు సంఘ శ్రేయస్సు కోరి, లోక కల్యాణం ఆకాంక్షిస్తూ నాతో రాజీపడి పోవటం మంచిది. నీకోసం ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ పక్కన ఉన్న మినీ రీడింగ్ రూమ్‌లో వెయిట్‌చేస్తూ ఉంటాను●●●

నీ........."

ఉత్తరం చదివిన నలుగురమ్మాయిలూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఎవరీ తాతీ?"

"ఈ ఉత్తరం రాసిందెవరూ?"

"తెల్లారిలేస్తే మన లాన్స్‌లో ఎక్కడ చూసినా జంటలే."

"కేంటీన్‌లో జంటలూ తక్కువలేరు. ఆ జంటలలో ఈ జంటని ఎవరనీ, నిర్ణయించేదెలా..."

రాగం తీసింది ఒకమ్మాయి.

"ఈ గోలంతా మనకెందుకూ? పోదాం, పదండి!" విసుక్కుంది మీనాక్షి.

ఆ ఉత్తరం డిస్పాచ్ సెక్షన్ బయట ఉత్తరాలు పడేసే టేబిల్‌మీద వారం రోజులుగా పడివుంది.

"మిస్.తా....తి...భజగోవిందా యూనివర్సిటీ, హైదరాబాద్" అని వ్రాసివుంది.

ఈ ఉత్తరం ఎవరూ తీసుకోలేదు.

"తా...తి" పేరు చాలా మందిని ఆకర్షించి, ఆపేరు గలవాళ్ళు ఎవరో వెతికి ఎవరూ లేరని నిర్ధారించుకున్నారు.

విజయ, అనంత, మాధురి, నళిని, మీనాక్షి ఒక జట్టు–అయిదుగురూ ఒక డిపార్టుమెంట్‌కాదు. అయినా, "ఔత్సాహిక కార్యక్రమల్లో" పాల్గొనే అలవాటు నలుగురికీ ఉండటంవల్ల స్నేహితులయ్యారు. మీనాక్షి తప్ప మిగిలిన నలుగురూ ఉత్తరం విప్పి చదవటానికి నిర్ణయించుకున్నారు.



"మరొకరి ఉత్తరం చదవ కూడదు" అడ్డుపడింది మీనాక్షి–

"ఆ మరొకరు" ఎవరో ఈ ఉత్తరం తీసుకోకపోబట్టి కదా చదువుతున్నాం. ఫరవాలేదు- "అజ్ఞానంలో ఉన్నవాళ్ళకి మనం సహకరించి వెలుగు చూపించ వచ్చు" ఫిలాసఫీ డిపార్టుమెంట్ అనంత ప్రోత్సహించింది.

వుత్తరం నలుగురూ చదువుతున్నప్పుడు మీనాక్షి కూడా కుతూహలంగా చదవటం వాళ్ళు గమనించారు-

"అడ్రస్ మన యూనివర్సిటీదే. దీనిమీద రీసెర్చికింక స్కోప్‌లేదు-ఎవరు, ఎవరికి ఎందుకు వ్రాసారో మాత్రమే మనం తెలుసుకోవాలి"

"నా తల కాయ ఆ వుత్తరం అక్కడ పడేసి పోదాం రండి" మరోసారి విసుక్కుంది మీనాక్షి-

"అలా విసుక్కుంటావేం? పేరు తెచ్చుకుంటోన్న వర్థమాన రచయిత్రివి. ముందు ముందు నీకిది వస్తువుగా వుపయోగపడవచ్చు" మందలించింది మాధురి–

అయిదుగురూ, మిని రీడింగ్‌రూం చేరుకున్నారు. రీడింగ్ రూంలో మాట్లాడ కూడదని రూలు. అంచేత ఆ గదిగోడలు గుసగుసలుతో ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ రూంలో విడిపోయిన జంటల లిస్టులో వున్న ఆడవాళ్ళు ఇద్దరూ, మొగవాళ్ళు ముగ్గురూ వున్నారు.

అయిదుగురూ కూడబలుక్కుని "తా... తి!" అని పిలిచారు నెమ్మదిగా. ఎవరు తిరిగి చూస్తారోనని "యస్" అంటు రెస్పాన్స్ ఇచ్చింది, ఆడపిల్ల కాదు జయనారాయణ్-స్టూడెంట్ యూనియన్ లీడర్!" తెలతెల పోయాయి ఆడపిల్లల ముఖాలు. జయనారాయణ్ అంతటితో ఆగలేదు. లేచి విజయ దగ్గరగా వచ్చి "బయటికిరండి! మాట్లాడుకుందాం"! అని తను బయటికి నడిచాడు వాళ్ళకి తప్పలేదు. చచ్చినట్టు ఆ యిడ గురూ చెట్టు కిందికి చేరవలసి వచ్చింది. సిమెంటు గచ్చు మీద కూచున్నారు.

"చెప్పండి? ఏం కావాలి?" అడిగాడు నారాయణ్.

"మిమ్మల్ని కాదు, పిలిచింది" గొణిగింది విజయ.

"తా.. తి! అంటే మీరా?" అడిగింది మాధురి!

"కాదు! కానీ, అది నా స్నేహితురాలి పేరు. అంచేత ఆ పేరుతో పిలవగానే నేను పలికాను."

"మీ స్నేహితురాలి......'"

నలుగురి ఎనిమిది కళ్ళు మీనాక్షివైపు తిరిగాయి.

అప్పటికే మీనాక్షి ముఖం ఎర్రగా కంది పోయి వుంది. కళ్ళలో రోషమూ, కన్నీరూ, కలగలసి మెరుస్తున్నాయి.



"అవును!" అన్నట్లుగా నవ్వాడు.

"చదివిందా?" అడిగాడు జయనారాయణ్

"చదివింది!" చెప్పారు నలుగురూ ఉత్సాహంగా.

"డెవిల్స్! బ్రూట్స్! ఇడియట్స్!" నోటికొచ్చినట్లు తిట్టేసి విసవిస వెళ్ళిపోయింది మీనాక్షి.

"ఎవర్ని?" అన్నారు నలుగురూ

"మిమ్మల్నే లెండి, నిజం చెప్పినందుకు! నన్నయితే అలా తిట్టదు. మీకు చాలా థేంక్స్ మా పెళ్ళిలో మీకు స్పెషల్ పార్టీ ఇస్తాను!"

"పెళ్ళి అవుతుందా?" అడిగింది అనంత.

"పోట్లాడుకుని వారం రోజులయినా ఇద్దర్లో ఎవరమూ కొత్త స్నేహాలు చేసుకో లేదంటే, పెళ్ళి అవుతుందన్నమాటేగా" చెప్పాడు జయనారాయణ్.

"తా...తి అంటే? తాతకి స్త్రీ లింగమా? మీనాక్షి తాతి ఎలా అయింది?" అడిగింది మాధురి.

"క్షమించండి! ఆ కథ నేను చెప్పలేను ఏ రచయిత్రికీ జీవితంలో అనుభవంలోకి రాకూడని దారుణ విషాద గాధ అది! కావాలంటే మీనాక్షిని అడిగి తెలుసుకోండి!" బరువుగా అడుగులు వేసుకుంటూ తూర్పు దిక్కుగా నడుచుకుంటూ వెళ్ళాడు. కేంటీన్ అటే!

"బోడి గొప్ప! సస్పెన్స్ అదరగొట్టేస్తున్నాననుకుంటున్నాడు."

అతడు పూర్తిగా కనుమరుగయ్యాక ధైర్యంగా అంది విజయ.

"మీనూ..." అంటూ మీనాక్షిని సమీపించబోయిన నలుగురూ ప్రణయకాల మహోగ్ర నిర్ఘాత సంఘాతిలా వున్న ఆమెని చూసి పారిపోయారు.


1,00,000 రూ॥లు గెలవండి! ఎంట్రీ ఫీజు లేదు!

| | | |
|---|---|---|
| 11 | 16 | 9 |
| 10 | 12 | 14 |
| 15 | 8 | 13 |

(మదిరి మొత్తం 36)

మొదటి బహుమతి : కలర్ టి. వి. లేక 10,000 రూ

రెండవ బహుమతి : 101 జపాన్ మోడల్ సూపర్ సౌండ్ నేషనల్ టేప్‌రికార్డర్. (చైన్ లింక్ పై) ఇదివ్యాపారఅభివృద్ధి పథకం పై 200/- రూ॥లకే.

| | | |
|---|---|---|
| 10 | | |
| | 11 | |
| | | 12 |

గమనిక : పై విధంగా గళ్ళుగీసి 7 నుంచీ 22 వరకు అంకెలని ఉపయోగిస్తూ ఎటుకూడినా మొత్తం 33 రావాలి. మొదట చేరిన ఎంట్రీకి రిష్టవాచీ బహుమతి. పోస్టుకార్డుపై మీ ఎంట్రీలు 15 రోజుల్లోగా పంపండి.

**SANDIP THADERS (J. H. 31)**

**P. B. No. 1289 Delhi 110006.**

మాధురి అతిత్వరలో చాలా మెటీరియల్ సేకరించింది.

"మీనాక్షి - జయనారాయణ్‌ల ప్రణయ కలహ కథ ప్రకారం బెట్టిదన......."

మీనాక్షి ఒక మంచి నవల, పదిపదిహేను కథలూ వ్రాసి, రచయిత్రిగా చెప్పుకోదగ్గ పేరు తెచ్చుకుంది. ఎంత అంటే అప్పటికే కొంతమందికి మనసుమండీ, పంకలు ప్రయత్నించేటంత!

ఒక అభ్యుదయ మహిళామండలి తలపెట్టిన సాహితీ కార్యక్రమాల్లో తనూ పార్టిసిపేట్ చెయ్యాలని ఉబలాటపడింది. జయనారాయణ్ ప్రేయసికి చిలక్కి చెప్పినట్లు చెప్పాడు.

"పిచ్చిదానా? సృజనాత్మక ప్రతిభకీ ఈ రకమైన సాహితీగోష్ఠులకీ, నక్కకీ, నాగలోకానికీ, ఉన్నంత దూరం! అలాటిచోట్ల కనపడేదీ, వినపడేదీ, రాజకీయాలు కానీ, సాహిత్యం కాదు-నువ్వు ఇలాంటి వాటికి దూరంగా ఉండు-ఆరోగ్యంగా ఉంటావు"

మీనాక్షి వినటం చిలకలాగేవిన్నా సమాధానం మాత్రం రచయిత్రిలాగ ఇచ్చింది.

"నా ప్రతిభ అందరూ గుర్తించాలనీ, నా కృషికి తగిన పేరు నాకు రావాలనీ, ఆరాటపడటంలో తప్పు లేదు నేను వెళ్తాను" అంది. అని ఊరుకోలేదు.

"నువ్వు అనవసరంగా ఈర్ష్యపడకు;" అని అంటించింది.

జయనారాయణ్ మాట్లాడలేదు...

అంతవరకూ చెప్పి ఆగింది మాధురి.

"తర్వాత?" అడిగారు.

"తర్వాతేంలేదు. మీనాక్షి మహిళా



మండలికి వెళ్ళింది. ఆసాహితీ కార్యక్రమాలు ఏ కారణంవల్లనో ఆగిపోయాయి. అప్పటినుంచీ మీనాక్షి జయనారాయణ్‌లు మాట్లాడుకోవటం మానేసారు. అంతే."

"ఇంత చిన్న కారణానికి మాటలు మానెయ్యరు."

"అక్కడేం జరిగిందో?"

"ఇంతకీ అసలు ఈ "తా...తి" ఏమిటి?"

అన్నివైపులనుంచీ ప్రశ్నలు.

"అది మనకి తెలిసే అవకాశం లేదు. ఆ మహిళామండలి రద్దయిపోయింది." నిరాశగా అంది మాధురి.

విజయకో బ్రహ్మాండమయిన ఐడియా వచ్చింది.

"ఆ మహిళామండలి సభ్యురాలు వెంకటమ్మగారు నాక్కొంచెం తెలుసు. మన లేడీ స్టూడెంట్స్ తరపున ఓ చిన్న సన్మానం కొట్టిస్తామని అడగటానికి వెళ్ళి ఆవిడ దగ్గిర విషయం లాగుతాను."

వెంకటమ్మ దగ్గిరకి వెళ్ళొచ్చిన విజయ, అసలు విషయం చెప్పటం మానేసి పడ పడి నవ్వటం ప్రారంభించింది.

"ఏమిటో చెప్పి ఏడువు. ఆ తర్వాత నవ్వుకో" అని మిగిలిన వాళ్ళు తిట్టాక సమాళించుకుని, అక్కడికీ మధ్యలో నవ్వుతూ చెప్పింది.

వాళ్ళు "భువన విజయాని"కి పోటీగా ఒక ప్రాచీన కవయిత్రీ సమ్మేళనం ఏర్పాటుచేయాలనుకున్నారట. కవయిత్రులంతా ఒక కాలం వాళ్ళు కాదు గనుక, అందరూ స్వర్గంలో సమావేశమయినట్లు కల్పించుకున్నారట."

"వెంకటమ్మగారు ప్రాచీన కవయిత్రుల పాత్రలన్నీ ఆయా వర్తమాన కవయిత్రులకి పంచి, తాను సాక్షాత్తు సరస్వతిగా నిలబడిందట. అలా పంచటంలో మన మీనాక్షిని తాళ్ళపాక తిమ్మక్కని చేసిందట. అక్కడ అందరూ వెటకారంగా నవ్వుకున్నారట

"నేను మధురవాణి ఏమిటి?" అని ఒకరూ "నేను మధురవాణి ఎందుకు కాకూడదు" అని ఒకరూ "ఇంతకు మధురవాణి అంటే కన్యాశుల్కంలో సానిత్రేనా?" అని ఒకరూ ఘర్షణపడి, చివరికి ప్రోగ్రాం మానేశారట. పాపం, మన మీనాక్షి మాత్రం తాళ్ళపాక తిమ్మక్కగా అదే అదే, "తా...తి"గానిలిచిపోయింది...."

"ఇంత చిన్న విషయానికి మీనాక్షి-జయనారాయణ్‌లు విడిపోకూడదు - మనం సంధి చేసేద్దాం" అని బయలుదేరారు- వాళ్ళకి ఎదురొచ్చారు, మీనాక్షి జయనారాయణ్‌లు కబుర్లు చెప్పుకుంటూ

తెల్లబోయిన స్నేహితులతో అంది మీనాక్షి -

"నిన్ననే తాళ్ళపాక తిమ్మక్కరాసిన సుభద్రాపరిణయం, మంజరీ ద్విపద చదివాను. ఎంతో బాగుంది. చేమకూర వెంకటకవి తన విజయవిలాసంలో దీన్లో చాలాభాగం కొట్టేసాడట. పేరు అతనికి దక్కింది. మహిళామండలికి ఏమి తెలీదుగనుక తిమ్మక్క పేరు విని నవ్వికోవాలని నన్ను చిన్నపుచ్చటానికి నాకాపోర్షన్ ఇచ్చారు. నన్ను "మీనూ" (చేపా) అని పిలవటంకంటే, విదుషీమణి అని అర్థంవచ్చే "తా...తి" అని పిలవటమే బాగుంది. వచ్చేనెల్లో మా పెళ్ళి! అప్పుడొద్దురుగాని. ఇప్పుడు డిస్టర్బ్ చెయ్యకండి."

అందర్నీ తప్పించుపోయారు అజంట.●